ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శనివారం 15 నవంబరు 2025





మొదలైన చలి

- జిల్లాలో పెరుగుతున్న చలి తీవ్రత
- సరాసరి కనిష్ఠ ఉష్ణోగ్రత 9.1 డిగ్రీలు నమోదు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో చలి మొదలైంది. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం వేళలో ఈదురుగాలులు, మంచు కురుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం ఉదయం వరకు సరాసరి కనిష్ఠ ఉష్ణోగ్రత9.1 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 32.4 డిగ్రీలుగా నమోదయింది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో రుద్రంగిలో 9.1 డిగ్రీలు, గంభీరావుపేటలో 9.9 డిగ్రీలు వీర్నపల్లిలో 10.7 డిగ్రీలు, బోయిన్‌పల్లిలో 11.1 డిగ్రీలు, చందుర్తిలో 11.2 డిగ్రీలు, తంగళ్లపల్లిలో 11.2 డిగ్రీలు, వేములవాడ రూరల్‌లో 11.3 డిగ్రీలు, కోనరావుపేటలో 11.4 డిగ్రీలు, ముస్తాబాద్‌లో 11.5 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 11.5 డిగ్రీలు, సిరిసిల్లలో 12.1 డిగ్రీలు, వేములవాడలో 12.5 డిగ్రీలు, కోనరావుపేటలో 12.7 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 15.2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డిసెంబర్ మాసంలో చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. ఈసారి నవంబరులోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 9.30 గంటల వరకు కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనాలు రోడ్ల మీదికి రావడం లేదు. సాయంత్ర కూడా చలి తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. చలి మంటలతో గ్రామాల్లో సేద తీరుతున్నారు. చల్లని గాలులకు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాలకు కూరగాయలు, పాలు తీసుకువచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

స్వెటర్లు, మఫ్లర్ల అమ్మకాల జోరు..

జిల్లా కేంద్రంలో వెచ్చదనం కోసం నూలు వస్త్రాల కొనుగోలు మొదలైంది. రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి వచ్చిన చిరువ్యాపారులు సిరిసిల్లలో ప్రత్యేక గుడారాలు వేసుకొని దుకాణాలను మిగతా 8వ పేజీలో..

శ్వాసకోశ ఇబ్బంది ఉంటే జాగ్రత్తలు పాటించండి..

- చలికాలంలో అస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి.
- సిగరేట్ అలవాటు ఉన్నవారు మానివేయాలి.
- దుమ్ము, ధూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లని గాలికి ఎక్కువగా తిరగవద్దు. శ్వాసనాళాలు మూసుకుపోకుండా మందులు వాడాలి.
- ఇన్‌హేలర్, నెబిలైజర్ వంటి వాటిని కూడా వాడాలి. ముక్కుభాగంలో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై తెమడ పేరుకుపోయి ఇబ్బంది పడే వారు సిరప్‌లు వాడాలి.
- చలికాలంలో ద్విచక్రవాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలి. స్వెట్టర్‌లను ధరించాలి.

గుండెజబ్బులున్న వాళ్లు..

- చలికాలంలో గుండెజబ్బు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్నవారు వాకింగ్ చేయవద్దు.
- చలిలో ఎక్కువగా తిరగడం వల్ల రక్తనాళాలు సంకోచించి గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయి. బీపీ, షుగర్ ఉన్న వారు కూడా ఈ జాగ్రత్తలు పాటించాలి.
- ఉన్నఫలంగా ఛాతీలో నొప్పి, నడవలేకపోవడం, చెమటలు పట్టడం వంటి సమస్యలు వచ్చినప్పుడు డాక్టర్లను సంప్రదించాలి.

పిల్లలపై దృష్టిసారించాలి..

- చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్తలు పడాలి.
- చలి నుంచి రక్షణ కోసం స్వెట్టర్‌లను తొడిగించాలి. వేడినీటితో స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది.
- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకు కూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- సీతాఫలాలు, ఐస్‌క్రీమ్‌లు, చాక్‌లేట్లు తినిపించవద్దు. జలుబు, జ్వరం వస్తే డాక్టర్లను సంప్రదించాలి.



సిరిసిల్లలో స్వెటర్ల అమ్మకాలు

డయాబెటిస్ ఉంటే భయపడవద్దు..

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డయాబెటిస్ ఉందని వ్యాధిగ్రస్తులు భయపడవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ రజిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 12150 మంది డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందకుండా సకాలంలో వైద్యులను సంప్రదిస్తూ మందులు వాడతూ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వైద్యుల సూచనలతో ఆహార నియమాలను పాటించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రక్త పరీక్షలతో పాటు గుండె, కంటి, కిడ్నీ సంబంధించిన పరీక్షలను కూడా చేయించుకోవాలని, పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. డయాబెటిక్ రాకుండా ఉండాలంటే ప్రతిరోజు కనీసం 30నిమిషాల పాటు వ్యాయామ చేయాలని ఒత్తిడిలను తగ్గించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం లోపాలతో కూడా డయాబెటిక్ వచ్చే అవకాశాలున్నాయని కాబట్టి సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఓట్స్, దంపుడు బియ్యం, తాజా కూరగాయాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. శీతాకాలం ప్రారంభమైనందున డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్ని దుస్తులు ధరిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డయాబెటిక్ సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రోబొటిక్ కిట్ల పంపిణీ



రోబొటిక్ కిట్‌లను అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి దేవయ్య

వేములవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోబొటిక్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య మాట్లాడుతూ రోబొటిక్ కిట్ విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు శాస్త్రసాంకేతిక విద్యను పెంపొందించడంలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దేశ భవిష్యత్తులో సాంకేతిక విద్య ఆవశ్యకత ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జి ప్రవీణ్, ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, సలాం, కోటేశ్వర్, బాలకృష్ణ, హమీద్, జ్యోతి, ఉమారాణి తదితరులు ఉన్నారు.

వేములవాడలో హెల్త్ టాక్, వాకథాన్ ర్యాలీ



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్, ఐఎంఏ సభ్యులు

వేములవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించకుని వేములవాడ పట్టణంలో శుక్రవారం హెల్త్ టాక్, వాకథాన్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి నృతృత్వంలో లయన్స్‌క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో తెలంగాణచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు డాక్టర్ డయాబెటిస్‌పై పలువురికి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, డాక్టర్ ఆనందరెడ్డి, తీగల వేంకటేశ్వర్‌రావు, అన్వర్ తదితరులు ఉన్నారు.

విద్యా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శుక్రవారం టీఆర్టీఎఫ్ 80వసంతాల అభ్యుదయోత్సవాలు, రాష్ట్ర విద్యా సదస్సు పోస్టర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ మాట్లాడారు. డిసెంబరు 21న హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల అభ్యుదయోత్సవాల వేడుకల్లో భాగంగా విద్యా సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరింపజేశామన్నారు. ఫెడరేషన్ ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న వేడుకలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు పాల్గొన్నాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, నాయకులు పోతుగంటి రమేష్, గోలి రాధకిషన్, మామిడాల రమేష్, గాజెంగి విష్ణు, బూట్ల శ్రీనివాస్, ఇప్పకాయల ప్రకాష్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి కృషి

- డీఐఈవో చెరుకు శరత్‌కుమార్



డీఐఈవోను సన్మానిస్తున్న అధ్యాపకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేయడానికి శ్రాయశక్తుల కృషి చేస్తానని డీఐఈవో చెరుకు శరత్‌కుమార్ అన్నారు. డీఐఈవోగా బాధ్యతలను స్వీకరించిన శరత్‌కుమార్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడారు. ఈ సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి, కళాశాలలో విద్యార్థులు సంఖ్యను పెంచడానికి అధ్యాపకులు సహకరించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేగుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జెల్ల సుమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సీరటి విష్ణుప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పళ్లు, సరుకుల పంపిణీ

తంగళ్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనగర్ శివారు లగిశెట్టి వృద్ధాశ్రమంలో శుక్రవారం వ్యవసాయకళాశాల విద్యార్థులు పళ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ సాయికుమార్, డాక్టర్ రాజా, ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

యూడైస్, అపార్‌అప్డేట్ ప్రక్రియ వేగంగా చేపట్టాలి

- సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని విద్యాలయాలల్లో యూడైస్, అపార అప్డేట్‌ల ప్రక్రియలను వేగంగా పూర్తిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం యూడైస్, అపార్‌అప్డేట్‌ల ప్రక్రియపై రెసిడెన్షియల్ విద్యాలయాలు, కేజీబీవీలు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని వివిధ విద్యాలయాలు 628 ఉన్నాయని అన్ని పాఠశాలల్లో యూడైస్, అపార్ అప్డేట్ వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. బర్త్ సర్టిఫికేట్ జారీలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత ఆర్డీవో, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రక్రియ వంద శాతం పూర్తిచేస్తే ప్రతి ప్రభుత్వ పథకం అమలు, వసతుల కల్పన, సిబ్బంది నియామకం నిధుల మంజూరుకు ఎంతో కీలకమని తెలిపారు. స్కూల్స్, కాలేజీల బాధ్యులు ప్రణాళిక ప్రకారం పనిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటుకబట్టీలు, రైస్‌మిల్లులు, క్వారీలు, తదితర స్థలాల్లో పనిచేస్తున్న కూలీల పిల్లలకు వర్క్‌సైట్ స్కూల్స్ ఏర్పాటుచేయాలని, పిల్లలకు విద్యను అందించాలని కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బాల కార్మికులు, బిక్షాటన చేస్తూ పిల్లలు కనిపించకూడదని స్పష్టం చేశారు. కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, కావాల్సిన వసతులపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్, డీటీ డబ్ల్యూవో సంగీత, జీసీడీవో పద్మజ, మైనార్టీ సంక్షేమాధికారి ఎంఏ భారతి, కార్మిక శాఖ అధికారి నజీర్‌అహ్మద్, కేజీబీవీ ఎస్‌వోలు,ఈఎంఆర్‌ఎస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పిల్లలను దత్తతకు అప్పగించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను పెంచే స్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను దత్తత కోసం అప్పగించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దత్తత మాసంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు పిల్లలను రోడ్డు మీద వదిలేస్తున్న సందర్భాలను చూస్తున్నామన్నారు. కాబట్టి ప్రభుత్వం ఇలాంటి పిల్లల కోసం ఒక చక్కని మార్గాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని, ఎవరికైనా పిల్లలను పెంచే శక్తి లేకుంటే ప్రభుత్వ శిశుసంరక్షణ కేంద్రాలకు అప్పగించాలన్నారు. దత్తత కోసం ఎదురుచూస్తున్న వారికి చట్టప్రకారం అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల హక్కుల అధికారి కవిత, ప్రొటెక్షన్ అఫీసర్ గగన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగాపూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రతి రోజు అందిస్తున్న ఓపీ, వైద్యసేవలపై అడిగితెలుసుకున్నారు. వివిధ వార్డుల్లో రూఫ్ లీకేజీ మరమ్మతుపనులు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు ఆధునీకరణ, పెయింటింగ్, ఏసీ, మరుగుదోడ్ల మరమ్మతు, మెష్‌డోర్స్ ఏర్పాటు, మెటర్నిటీ వార్డులోని ఓపీ వద్ద పెయింటింగ్, మెష్ డోర్స్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఇంకా ఔట్‌పేషెంట్ మేల్ వార్డు మందులు తీసుకునే వద్ద షెడ్ ఏర్పాటు అదనంగా నల్లా కనెక్షన్‌లతో పాటు ఆక్సిజన్ స్టోరేజ్ గదిలో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సభ్యత్వ నమోదు పెంచాలని, వైద్యులు, సిబ్బంది, ఆయా శాఖల అధికారులతో నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌రాజేశ్వరీ, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్‌రజిత, డీసీహెచ్ఎస్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్‌లు అవాస్‌గౌరీ, ఎం లక్ష్మీనారాయణ, సుగుణ, ప్రసాద్, ఐఎంఏ అధ్యక్షుడు శోభారాణి, ఆర్ఎంవో డాక్టర్ కపిల్ సాయి, లయన్స్ క్లబ్ బాధ్యులు నాగుల సంతోష్, రెడ్‌క్రాస్ బాధ్యులు ప్రయాకరావు వేణు, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పట్టణ సీఐ కృష్ణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ప్రభుత్వం గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ అన్నారు. శుక్రవారం గ్రంథాలయంలో సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీ శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ గ్రంథాలయం వారోత్సవాలను ముఖ్య అతిథి పట్టణ సీఐ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి సీఐ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను యువత ఉపయోగించుకుంటూ ఎంచుకొన్న లక్ష్యాలలో విజయాలను సాధించాలన్నారు. లాంగ్ టర్మ్ శిక్షణలో ఉన్న యువతి, యువకులు మెమోరితో చదవాలని ఒకటికి రెండు సార్లు ప్రిపేర్ అవ్వాలన్నారు. మరో అతిథి తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూకంటి జగన్నాథం మాట్లాడారు. తెలుగు భాష పట్ల విద్యార్థులందరూ ఆత్మాభిమానంతో భాషాభిమానంతో ఉండాలని అప్పుడే తెలుగు భాష వర్ధిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మరో అతిథి సిరిసిల్ల పట్టణ ఎస్ఐ శ్రీకాంత్, గ్రంథపాలకుడు కమటం మల్లయ్య, సిబ్బంది కూన శ్రీనివాస్, సాయిబాబ, రామకృష్ణ, కవిత, మాధవి, మహేష్, యువతీ, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళ సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్ జయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారోత్సవాలు ఈనెల 20 వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్రత్, లైబ్రేరియన్ మంజుల, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ఇల్లంతకుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో శనివారం అభివృద్ధి పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజలు చేయనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి అనంతారం గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి, రేపాక గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజలు, అనంతగిరి గ్రామంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదలడం, సిరికొండ,అనంతారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నాయకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సీఎంను కలిసిన విప్ ఆది శ్రీనివాస్



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యలయంలో సీఎంను కలిసి శాలువాతో సన్మానించారు. కాగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపగా తన గెలుపుకోసం కృషి చేసిన విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

తంగళ్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్శరాములు మాట్లాడుతూ చిన్నారులకు సమాన హక్కులు కల్పించడం, వారికి అవసరమైన రక్షణ తదితర సహాయాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మల్లేశ్ యాదవ్, న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం అంజనేయులు, లోక్ అధాలత్ సభ్యులు, ప్రిన్సిపాల్ రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో శుక్రవారం బాలల దినోత్సవ సందర్భంగా బీజేపీ పట్టణ, వార్డు కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, వార్డు కమిటీ ఇన్‌చార్జి పోకల భవానిల ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్‌లు రవళి, డాక్టర్ సాయికుమార్‌లు పాల్గొని పిల్లలతో పాటు ప్రజలందరికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడప సంతోష్, వడ్నాల శేఖర్‌బాబు, వెలిశాల అభినయ్, కొంపెల్లి విజయ్, రామారావు, సోమిశెట్టి పూజిత, చోడబోయిన కౌసల్య, కముటం మంజుల, చెవిటి మల్లీశ్వరీ, సువర్ణ, సౌజన్య, రూప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



లారీని ఢీకొన్న కారు

మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని స్థానిక రైస్‌మిల్లుల వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక సీఐ సంజీవ్ వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని కొండపాకకు చెందిన కోట సాయిచరణ్ బంధువుల వివాహం చల్లూరు గ్రామంలో గురువారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన నవదంపతులను కారులో తీసుకొని శుక్రవారం తెల్లవారు జామున కరీంనగర్‌కు బయలుదేరారు. మానకొండూర్ రైసుమిల్లుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారును నడుపుతున్న సాయిచరణ్‌తోపాటు రిషికేష్‌కు తీవ్రగాయాలవగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నలుగురిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సాయిచరణ్ తండ్రి నర్సింహరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మర్రిగడ్డలో మూలమలుపు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కిష్టంపేట గ్రామానికి చెందిన చిగుర్ల ఎల్లయ్య, భూమండ్ల కొమురయ్య అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వేములవాడ నుంచి కిష్టంపేటకు వెళుతుండగా మార్గ మధ్యలోని మర్రిగడ్డ గ్రామ శివారులో ననుగులకు చెందిన బాలురు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ సంఘటనలో ఎల్లయ్య, కొమురయ్యలకు కాలు విరగడంతోపాటు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

వేతన వేతలు



- ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు సకాలంలో అందని జీతాలు
- సర్కారు స్పందించాలని వేడుకోలు

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్)కు వేతనాలు సకాలంలో అందడం లేదు. వేతనాలు సకాలంలో అందక పోవడంతో అవస్థలు పడుతున్నారు. అసలే చాలీచాలని వేతనంతో మారుమూల గ్రామాలకు వెళ్లి పనిచేస్తున్న చిరుద్యోగులు సమయానికి జీతాలు రాక అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,038 మంది ఓపీఎస్‌లు పనిచేస్తుండగా, జగిత్యాల జిల్లాలో 28 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి పలు జిల్లాల్లో ఈ యేడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. జగిత్యాల జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు చెందిన వేతనాలు అందలేదని వాపోతున్నారు.

● నాలుగేళ్ల క్రితం నియామకం..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించారు. వీరిలో చాలా మంది ఉన్నత చదువులు చదువుకున్నారు. ఎప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం లభిస్తుందన్న ఆశతో చాలీచాలని వేతనాలతో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు చేసే పనులతో సమానంగా పంచాయతీల్లో ఓపీఎస్‌లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓపీఎస్‌లకు నెలకు రూ.19,500 వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఈ ఏజెన్సీలు వీరి ఖాతాల్లో వేతనాలు జమ చేయాల్సి ఉంటుంది. వీరి ఖాతాల్లో కేవలం రూ.15 వేలు మాత్రమే జమ చేస్తున్నారని, మిగిలిన వేతనంలో ఎందుకు కోత విధిస్తున్నారో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడం లేదని చిరుద్యోగులు వాపోతున్నారు. ఓపీఎస్‌లందరికి క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు.

● భారంగా కుటుంబ పోషణ..

సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఓపీఎస్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో పైసలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దెలు, ఈఎంఐలు, పిల్లల చదువులకు ఫీజులు, నిత్యావసరాలకు తిప్పలు తప్పడం లేదు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఒక్కొక్కరికి రూ.లక్షపైనే బకాయిలున్నాయి. చాలీచాలని వేతనాలు అందితేనే కుటుంబాలను కష్టంగా వెళ్లదీసే కాలంలో అసలు వేతనాలు రాకపోవడంతో ఎలా కుటుంబాలను నెట్టుకురావాలని ఓపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో వేతనాలు అందించాలి

-సిద్దం సతీష్, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలి. అసలే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాము. ఎప్పటికప్పుడు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం.

ఓపీఎస్‌ల సమస్యలను పరిష్కరించాలి

-కె.సందీప్ రెడ్డి, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



రాష్ట్రంలో ఓపీఎస్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వేతనాలు సకాలంలో చెల్లించాలి. ఓపీఎస్‌లందరినీ రెగ్యులరైజ్ చేయాలి. క్రమబద్ధీకరణ చేస్తూ సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలి. వేతనాల్లో ఎలాంటి కోతలు లేకుండా ఏజెన్సీలు చెల్లించాలి.

అల్మాస్‌పూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చోరీ
- నగదు, బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చొరబడ్డారు. నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరాజు, రాజు, భూ లక్ష్మీ, లచ్చయ్యతోపాటు మరోవ్యక్తి తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు వేసిన ఇళ్ల తాళాలు పగుల కొట్టి లోనికి ప్రవేశించారు. ఇళ్లలోని బీరువాలను ధ్వంసం చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. సుమారు రూ.లక్షన గదు, రూ.2.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుని పరిశీలించారు. జాగిలం, వేలిముద్రల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7200 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7200 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 589 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14 క్వింటాళ్లు గోనెసంచుల్లో విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7200, కనిష్ఠ ధర రూ.6200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఫీజు చెల్లించినా.. హాల్ టికెట్ రాలేదు..

● న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ కాలేజీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో హాల్‌టికెట్ రాకపోవడంతో రాజరాజేశ్వర సంస్కృత కళాశాల విద్యార్థి సాయిచంద్రిక పరీక్షరాసే అవకాశం కోల్పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి సంఘాలు ఆమెకు అండగా నిలిచాయి. దీంతో విద్యార్థినికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం దక్కింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ సంస్కృత కళాశాలలో బీఏఎల్ రెండో సంవత్సరం చదువుతున్న సాయిచంద్రిక సెమిస్టర్ పరీక్షలకోసం ఫీజు చెల్లించినప్పటికీ హాల్ టికెట్ రాలేదు. దీంతో మొదటిరోజు నిర్వహించిన రూరల్ డెవలప్‌మెంట్ సబ్జెక్ట్ పరీక్షకు ఆమెను అనుమతించలేదు. పరీక్షరాసే అవకాశం ఇవ్వకపోవడంతో ఆందోళనకు లోనైన ఆమె ఆసుపత్రి పాలైంది. ఈ విషయం తెలుసుకున్న బీసీ విద్యార్థి సంఘం నాయకుడు సాయి తదితరులు కళాశాల అధ్యాపకులను నిలదీశారు. సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ సిబ్బందిచేసిన పొరపాటు కారణంగానే హాల్‌టికెట్ రాలేదని ఆరోపించారు. ఈ అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని వివరణ కోరగా తప్పుగా నమోదుకావడం వల్ల ఈపొరపాటు జరిగిందని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులను కలిసి ఈ విషయాన్ని వివరించడంతో హాల్‌టికెట్ జారీచేశారని, తదుపరిపరీక్షకు సాయిచంద్రిక హాజరుకావచ్చని తెలిపారు. సాంకేతిక కారణాలవల్ల తప్పుజరిగిందని, రాయలేకపోయిన మొదటి పరీక్షను తర్వాత నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 57మందికి జరిమానా



సిరిసిల్ల: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్షతోపాటు జరిమానాలు తప్పవని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టామని, మద్యం తాగి వాహనాలు నడిపిన 57మందిని శుక్రవారం సిరిసిల్ల కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జరిమానాలు విధిస్తూ మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. వీరికి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రతిజ్ఞ చేయించి కౌన్సె లింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడి పిన ఇద్దరికి రూ.6వేలచొప్పున, 12మందికి రూ.5 వేల చొప్పున, ఒక్కరికి రూ.4వేల చొప్పున, 42 మందికి రూ.వెయ్యి చొప్పున జరి మానాలను విధించారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో 37మందికి..

ఎల్లారెడ్డి పేట: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు జిల్లా రెండోతరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 37మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని తెలిపారు.

పరీక్షల అనంతరంనివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరు పరిచామని చెప్పారు. 37మందికి మొత్తం 59వేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కల్లెడ శివారులో గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో కట్ట రాజేందర్, బత్తుల సుమన్ అనే వ్యక్తులను గాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన సుమన్, రాజేందర్ ధర్మపురి నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో కల్లెడ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో రాజేందర్ కుడిచేతికి, సుమన్‌కు కుడికాలికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

కోనరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికిచెందిన బంగారు ముత్తవ్వ కోతి దాడిలో గాయపడింది. గ్రామానికి చెందిన ముత్తవ్వ పనిమీద ఊరిలోకి వచ్చి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా వానరం దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి



మైదానాన్ని సిద్ధం చేయిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 17 తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అండర్-14, అండర్-17 బాలికలు, బాలురుకు యోగా చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్ మొండయ్య, భాషా బోయిన వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది క్రీడా నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. వెలిచాల గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాలులో బాలికలకు, జడ్పీఉన్నత పాఠశాలలో బాలురకు వసతి కల్పించినట్లు చెప్పారు. క్రీడాకారులందరికీ స్థానిక నాయకుడు వీర్ల హన్మంతరావు యూత్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు త్వరలో కలకత్తాలో నిర్వహించే అండర్-14 కేటగిరి, త్రిపురలోని అగర్తలో అండర్-17 కేటగిరిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు ఫిజికల్ డైరెక్టర్ దత్తాత్రేశర్మ, క్రీడల ఎస్‌జీఎఫ్ సహాయకులు, నిర్వాహణ బాధ్యులు మల్లేశం, నగేష్, మహిపాల్‌రెడ్డి, మహేందర్, పద్మలతాదేవి, సుజాత, పుష్పలత, హాలీముద్దీన్‌షేక్, యాకుబ్ అలీ, వెలిచాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో మల్యాల విద్యార్థినికి ప్రథమ స్థానం



కీర్తనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీ-సాట్, రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్తంగా టీ-సాట్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో రాజన్నజోన్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. చందుర్తి మండలం మల్యాల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పులికీర్తన రాజన్న జోన్‌జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా కీర్తనను చందుర్తి మండల విద్యాధికారి వినయ్ కుమార్, మల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌చంద్ర, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పీసరి మంజుల, స్వామి వివేకానంద సేవాసమితిసభ్యులు,గ్రామస్థులు అభినందించారు.

రేకుల షెడ్డు దగ్ధం

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బురవేని సమత రేకుల షెడ్డులో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. దీంతో ఫ్రిడ్జ్, కూలర్‌తో పాటుగా మంచాలు, బట్టలు రూ. లక్ష విలువ గల500 నోటు కట్టలు దగ్ధమైనట్లు జగిత్యాల రూరల్ ఎస్.ఐ సధాకర్ తెలిపారు. బాధితురాలు సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

వరకట్నం వేధింపులతో గర్భిణి ఆత్మహత్య



సుప్రియ(ఫైల్)

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధి కుర్మపల్లిలో వరకట్న వేధింపులు తాళలేక గర్భిణి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన వోడ్నాల రాజేశం కూతురు మనుశ్రీ అలియాస్ సుప్రియ(26)ను కుర్మపల్లికి చెందిన వేముల సతీష్‌కు ఇచ్చి 2023లో వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నం కింద 13 తులాల బంగారం, రూ. రెండు లక్షల విలువ గల గృహోపకరణాలు అందజేశారు. సంవత్సరం పాటు సజావుగా సాగిన వీరి దాంపత్య జీవితంలో సుప్రియకు కుమారుడు పుట్టాడు. అనంతరం భర్త సతీష్, అత్త భూలక్ష్మి, మామ చంద్ర య్య అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారు. ఈ విషయం సుప్రియ తండ్రి రాజేశంకు తెలుపగా యేడాది క్రితం పోతారంలో పంచాయితీ పెట్టారు. పెద్ద మనుషుల సమక్షంలో సతీష్ భార్యను మంచిగా చుసుకుంటానని ఇంటికి తీసుకుని వెళ్ళాడు. అనంతరం సుప్రియ గర్భం దాల్చింది. ఏడునెలల గర్భిణి అని చూడకుండా వేధింపులకు గురిచేశారు. గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చిన సతీష్ భార్య గర్భిణి అని చూడకుండా తీవ్రంగా కొట్టినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన సుప్రియ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు ఉరివేసుకొని మృతి చెందినట్లు బంధువుల ద్వారా అందిన సమాచారం మేరకు తల్లి దండ్రులు వెళ్ళిచూడగా బెడ్‌రూంలో సుప్రియ చేతుల గాజులు పగిలి, ఎడమచేతికి గాయాలతో ఉన్నట్లు తండ్రి రాజేశం తెలిపారు. భర్త, మామ, అత్తలు కలిసి అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. వరకట్నవేధింపులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు పరిశీలించారు. కాగా అత్త, మామ పరారీ ఉండగా భర్త సతీష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిగారిల్లు అయిన పోతారంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం..

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

● రూ. 10 వేల జరిమానా

జగిత్యాల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసి హత్య చేసి, సాక్ష్యాలను తారుమారు చేసిన కేసులో నిందితుడుకి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడుషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జ్ నారాయణ శుక్రవారం తీర్పు చెప్పారు. మెట్‌పల్లి బోయవాడకు చెందిన నిందితుడు వాల్గోట్ కిషోర్ 2021 డిసెంబరు 28న తన భార్య నిషితను తన ఇంట్లోనే గొంతు నులిమి చంపి, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తప్పుడు కథనాలు చెప్పి సాక్ష్యాలను దాచడానికి ప్రయత్నించాడు. ఈఘటనపై మృతురాలి తండ్రి కాశబోయిన పెద్దపోచయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎన్ సదాకర్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ వి రవీంద్రరెడ్డి కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాలను సేకరించారు. సాక్ష్యాల ఆధారంగా పీపీ వాదనలు వినిపించగా నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన డీఎస్పీ రవింద్రరెడ్డి, ఎస్సై సదాకర్, పిపి మల్లేశం, కోర్టు కానిస్టేబుల్ టి రజిత, సియంఎస్ ఎస్సై శ్రీకాంత్, పిసిలు రాజు నాయక్, కిరణ్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గుంటూరుపల్లి వద్ద శుక్రవారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో 260గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గుంటూరుపల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై ముగ్గురుయువకులను పట్టుకున్నామని, వాహనం తనిఖీ చేయగా గంజాయి లభించిందని సీఐ తెలిపారు. దుర్శేడ్‌కు చెందిన నేరెళ్ల చరణ్, గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి లోకేష్, మరోబాలుడిపై కేసునమోదు చేశామని తెలిపారు. గంజాయితోపాటు కొంతనగదును, బైక్‌నుస్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బందిని రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభి నందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం

శంకరపట్నం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో నేషనల్ హైవేబైపాస్ రోడ్డులో ఆగిఉన్న టిప్పర్‌ను బైక్‌ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల వివరాలప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికిచెందిన వెంగళ ప్రవీణ్, శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై కేశవపట్నం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ఇప్పలపల్లికి వెళ్తున్నారు. కేశవపట్నం శివారులో ఆగి ఉన్న టిప్పర్‌ను వీరి బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వెంగళప్రవీణ్(35) అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాస్ పరిస్థితివిషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రవీణ్‌కు ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష

● రూ.10వేల జరిమానా

జగిత్యాల టౌన్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయిసాగుతో పాటు గంజాయిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్న ముగ్గురు నిందితులకు ఏడు సంవత్సరాల జైల్‌శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. గతేడాది జగిత్యాల పట్టణ పోలీసులు కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఓ షాపింగ్‌మాల్ వద్ద అనుమానస్పదంగా సంచరిస్తున్న మేకల రాజు అలియాస్ కిన్నరి, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుముళ్ల సాయికుమార్, ఆసిఫాబాద్‌కు చెందిన మడవి చందు అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోతున్న క్రమంలో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద సోదాలు చేయగా గంజాయి లభ్యం కాగా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీరు గోదావరి నది అవతల ఉన్న ఊట్నూర్ ప్రాంతంలో మడవి చందు అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు 250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకుని జగిత్యాలలో విక్రయించేందుకు వచ్చిన క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. విచారణ జరిపిన న్యాయస్థానం నేర నిరూపణ కావడంతో నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన టౌన్‌ఇన్‌స్పెక్టర్ కిషోర్, పీపీ కె మల్లేశ్‌గౌడ్, సీఎంఎస్ ఎస్సై ఎస్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌ను ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెడికల్‌షాపు ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన శుక్రవారం హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లికి చెందిన నర్సయ్య తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పట్టణంలోని సంజీవని మెడికల్‌షాపు ఎదుట నిలిపి మందుల కొనుగోలుకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. సీసీ కెమెరా ఫుటేజ్‌లో చూడగా గుర్తుతెలియని వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్లాడు. వెంటనే నర్సయ్య హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ద్విచక్రవాహనంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఉన్నాయని బాధితుడు పేర్కొన్నాడు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శుక్రవారం కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వేగంగా శిథిలాల తొలగింపు



శిథిలాల తొలగింపు పనులు

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కూల్చివేసిన పాతభవనాల శిథిలాల తొలగింపు పనులు వేగవంతమయ్యాయి. దర్శనాలు నిలిపివేశారు. స్వామి వారికి చతుష్కాల పూజలు కొనసాగుతున్నాయి. కూల్చివేతల సందర్భంగా ఏర్పడిన శిథిలాల తొలగింపునకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు దర్శనాలను నిలిపివేసి ఆలయ ఆవరణ చుట్టూ రేకులతో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్

కోరుట్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఓరుగంటి వర్షిత్ అండర్14విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్‌పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడికరీంనగర్‌జిల్లాలోని గర్రెపల్లిలో జరిగిన జిల్లాస్థాయిపోటీల్లో ఓరుగంటి వర్షిత్ జగిత్యాల జిల్లా తరుపునపాల్గొని ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి వర్షిత్‌ను నర్సింహమూర్తి, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

టామ్‌కామ్

- నకిలీ ఏజెంట్లకు చెక్
- గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి అవకాశాలు



చొప్పదండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి టామ్‌కామ్ ఒక వారధిగా నిలుస్తున్నది. నకిలీ ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లి నష్టపోయిన బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్)ను తీసుకువచ్చింది. ఏజెంట్లు, దళారుల ప్రమేయం లేకుండా టామ్‌కామ్ పని చేస్తుంది. విద్యార్హతలకు అనుగుణంగా అర్హులైనవారు తమ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది టామ్‌కామ్. మధ్యవర్తుల ద్వారా మోసపోకుండా ఈ సంస్థ పనిచేస్తూ యువతకు ఉద్యోగాలను కల్పిస్తున్నది.

● అనేక దేశాలకు...

టామ్‌కామ్ వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకున్న వారికి గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి కల్పిస్తుంది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, ఓమన్, యూఏఈతోపాటు జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, పోర్చుగల్, పోలాండ్, అమెరికా లాంటి దేశాలకు టామ్‌కామ్ పంపిస్తుంది. నైపుణ్యం ఉన్నవారిని అవసరమున్న దేశాలకు పంపిస్తుండగా, కొన్ని దేశాల సంస్థలు ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్‌ను సంప్రదిస్తున్నాయి. జర్మనీ, జపాన్ దేశాలకు ఎంపికైన వారికి అక్కడి భాషలు నేర్పించి పంపిస్తారు. మిగతా దేశాలకు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆంగ్ల భాషలో పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లో అందిస్తారు.

● ఖాళీలను బట్టి ఎంపిక...

టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ దేశాల్లో ఖాళీలను బట్టి ఎంపిక చేస్తుంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబింగ్, ఫార్మా, భవన నిర్మాణరంగం, నర్సింగ్ విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేస్తుంది. దరఖాస్తు చేసుకున్నవారి అర్హతను బట్టి ఎంపిక చేస్తుంది. జర్మనీ, ఇజ్రాయిల్‌తోపాటు వివిధ దేశాల్లో ఉద్యోగ ఖాళీల కోసం ప్రస్తుతం టామ్‌కామ్ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఎంపిక కోసం ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ల్లో శిక్షణను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌ను అందజేస్తుంది. ఈ సర్టిఫికెట్లకు విదేశాలలోనూ గుర్తింపు ఉంటుంది.

● దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

నైపుణ్యం కలిగినవారు విదేశాల్లో ఉద్యోగం కోసం టామ్‌కామ్ అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. విదేశాల్లో ఉన్న ఉద్యోగావకాశాలను దరఖాస్తుదారులకు సమాచారాన్ని అందిస్తారు. అర్హతనుబట్టి శిక్షణను ఇచ్చి ఉద్యోగాల్లో నియమిస్తారు. విదేశాల్లో ఎలాంటి మోసాలు, ఏజెంట్లు, మధ్యవర్తులు లేకుండా మంచి ఉద్యోగాలు పొందేందుకు టామ్‌కామ్ మంచి అవకాశాలు కల్పిస్తోంది.

పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్‌చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని టాప్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2024నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్లలో కొంతమందికి మాత్రమే బెనిఫిట్స్ చెల్లించడం సరి కాదన్నారు. పెన్షనర్స్‌కు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేపడతామన్నారు. టాప్ర నాయకులు సమ్మయ్య, వీరస్వామి, వెంకటయ్య, కిష్టయ్య, కనుకయ్య, సాంబయ్య, హరికిషన్, రాజిరెడ్డి, శ్రీహరి, లక్ష్మీనారాయణ, స్వామిరెడ్డి, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు 9,454క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఉమ్మడి జిల్లా భగవద్గీత శ్లోక కంఠస్త

పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భగవద్గీత శ్లోక కంఠస్త పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్స్ కార్య నిర్వాహకుడు కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, గాయత్రి విద్యానికేతన్‌లో 17న ఉదయం 10 గంటలకు, 18న కరీంనగర్ టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 10గంటలకు, 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం బాలరాజుపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు, 20న జగిత్యాల జిల్లా కోరుట్ల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ స్థాయి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. చదివే అధ్యాయాలు తెలుసుకునేందుకు, పాల్గొనేందుకు, రిజిస్ట్రేషన్ కోసం 7396950725, 9441790725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు

మంజూరు చేయాలి

చిగురుమామిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ(సీతక్క)కు లేఖలు రాసినట్లు తెలిపారు. ఈసందర్భంగా విలేకరుతో మాట్లాడారు. 2020,2025లో కురిసిన భారీ వర్షాలకు అనేకగ్రామాల్లో రోడ్లు చెరువులు దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని రేకొండ -మొగిళిపాలెం, పెద్దమ్మపల్లిలో బ్రిడ్జిలు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ విషయాన్ని సీఎంరేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలకాలి

● హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలికి హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట గ్రామాల్లోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, పార్వతీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి ప్రతిష్టాపన ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. రాచర్లగొల్లపల్లిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ స్థలాన్ని విద్యారణ్య భారతీస్వామి పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి హిందూ ధర్మాన్ని మర్చిపోతున్నారన్నారు. చిన్నతనం నుంచే పుట్టిన రోజున ఆధ్యాత్మికత పెంపొందించేందుకు పిల్లలతో భగవద్గీత, రామాయణం, హిందూ ధర్మ పుస్తకాలను అందజేసేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, స్థానికకాంగ్రెస్ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

● వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్‌బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వఉన్నత పాఠశాలను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలతరగతి గదులు, మధ్యాహ్న భోజనశాల, క్రీడామైదానం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు- తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రులకు పలు సూచనలను చేశారు. పదోతరగతి విద్యార్థులకు స్టడీహవర్స్, పరీక్షలకు సిద్ధత,పాఠశాలకు హాజరుశాతం, పిల్లల పరిరక్షణపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐఎఫ్‌బీ ప్యానల్ టీవీలద్వారా కంప్యూటర్‌విద్యను కూడా తప్పనిసరి చేశారన్నారు. అక్టోబరునుంచే పదో తరగతి విద్యార్థులకు స్టడీ హవర్స్‌ను ప్రారంభించామన్నారు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు శారద, చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులతో పాఠశాల విద్యాకార్యకలాపాలపై సమీక్షించారు. బాలలదినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

ఎన్‌టీపీసీలో నూతన ఆవిష్కరణలు

● వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం ● ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల్లో ఈడీ చందన్ కుమార్ సామంత



కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

జ్యోతినగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో త్వరలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. 48వ ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఏటీఎం బిల్డింగ్‌ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో త్వరలో వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల భవిష్యత్‌లో విద్యుత్ రంగం కీలకం కానున్నదన్నారు. అలాగే కార్బొనేటెడ్ బ్రిక్స్ ప్లాంటును ఎన్టీపీసీలో నిర్మించనున్నట్లు తెలిపారు. 48 ఏళ్లుగా ఎన్టీపీసీ దక్షిణాదికి వెలుగులను అందిస్తోందని, ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ మిగతా ప్రాజెక్టులకు పోటీగా నిలుస్తుందన్నారు. దేశంలో సౌరవిద్యుత్ స్థాపిత సామర్థ్యం పెరిగిన నేపథ్యంలో థర్మల్‌విద్యుత్ డిమాండ్ తగ్గిందని, రామగుండం ఎన్టీపీసీలో సైతం విద్యుత్ ఉత్పత్తిని కుదించాల్సి వచ్చిందన్నారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ పథకం ద్వారా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహకారంతో ఈప్రాంతంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు.

ఘనంగా రేజింగ్ డే వేడుకలు..

రామగుండం ప్రాజెక్టు రేజింగ్‌డే సందర్భంగా శుక్రవారం ఉత్సవాలను నిర్వహించారు. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చందన్ కుమార్ పాల్గొని ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పలు పోటీలలో విజేతలకు ఈడీ, ఇతరఅధికారులు బహుమ తులను అందించారు. వివిధవిభాగాల జనరల్‌మేనేజర్లు, హెచ్‌ఓడీలు, ఈజీఎం, హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిగ్దర్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శాస్త్రి, ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వరదలు, ముంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ● సిరిసిల్ల మానేరులో ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల మాక్‌డ్రిల్



సిరిసిల్ల మానేరువాగు ఒడ్డున అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరదలు, ముంపు నివారణ అవగాహనతో సాధ్యమని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. సిరిసిల్ల మానేరు వాగులో శుక్రవారం కమ్యూనిటీ అవేర్‌నెస్‌లో భాగంగా భారత ప్రభుత్వం, హోంశాఖల ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా అదనపుకలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విహార యాత్రలకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నది తీరాల్లో విహరించే వారు, ఈతరానివారు నీళ్లలో మునిగిపోయినప్పుడు ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, అకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థర్మకోల్‌షీట్స్, ప్లాస్టిక్‌బిందెలు, ఎండిన కొబ్బరి బోండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్ధ తులు తెలియజేశారు. నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని ఎలా బయటకు తీయాలో చూపించారు. బయటకు తీసుకువచ్చిన వ్యక్తికి సీపీఆర్, కృతిమ శ్వాస ఎలా అందించాలి, నీరు ఎలా బయటకు రప్పించాలో చూపించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అపద సమయంలో ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ గౌతం, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో అఫ్జల్ బేగం, సీపీవో శ్రీనివాసచారీ, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో శుక్రవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో..

వేములవాడపట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. భక్తులతో బద్ది పోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

జీవితంపై విరక్తి చెంది ఒకరి బలవన్మరణం



హన్మంతు(ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగదాముని పల్లె గ్రామంలో ఈర్తి హన్మంతు(47) అనేవ్యక్తి తన పంట పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హన్మంతు కొంత కాలంగా తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బునయం కోసం పలు అసుపత్రుల చుట్టూ తిరిగి లక్షలు వెచ్చించి వైద్య చికిత్సలు చేయించుకున్నప్పటికి రోగం నయం కాలేదు.. దీనికి తోడు అప్పులు చేసి వైద్య చికిత్సలు చేయించుకోవడంతో ఆర్థిక భారం మీద పడింది. ఆరోగ్యం సహకరించడంలేదని..అప్పులెలా తీర్చేది అంటూ తరచుగా మదనపడుతూ ఉండేవాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తన పంట పొలం వద్ద చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శంకర్(ఫైల్)

రుద్రంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌పై నుంచి పడిన వ్యక్తి గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంధం శంకర్(55) బుధవారం తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో శంకర్ తలకు, నడుముకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకర్ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



సర్టిఫికేట్‌లను ప్రదానం చేస్తున్న జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలో సాంకేతిక అభివృద్ధిపై జరిగిన వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తితోపాటు అవగాహన పెంచడానికి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. వర్క్‌షాప్ సెమినార్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ప్రయోగాత్మక పరిశోధనలు చేశారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, వరంగల్ నిట్ ప్రొఫెసర్స్ లక్ష్మారెడ్డి, హరనాథ్, కన్వీనర్లు శంకర్, మహేందర్, రాజేశ్ కుమార్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు రాంతేజ, శ్రీజ,నవ్య, ప్రణీత్, వర్షిత, మమత, సమీద్, తేజ, కరీంనగర్, వాగేశ్వరీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక



జ్ఞాపికతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ వీరప్రభాకర్, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల11 నుంచి 13వరకు సుల్తానాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. కబడ్డీ పోటీలో విద్యార్థులు రాణించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. చెస్‌లో అఖిల్ రెండో స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో గిరి బంగారు పతకం, వివేక్ కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో వంశీ బంగారు, 1500 మీటర్ల పరుగు పందెంలో వివేక్ కాంస్య, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో సాకేత్ కాంస్య, వెండి పతకాలను సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ హన్మంతరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్' విజయంపై కాంగ్రెస్ సంబరాలు



సిరిసిల్లలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



వేములవాడలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్ కమిటి డైరెక్టర్లు ఎండీ ఖాజా, దుబాల వెంకటేశం, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ, వెంగళ లక్ష్మీనర్సయ్య, కత్తెర దేవదాస్, రెడ్యానాయక్, నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, గుజ్జె రమేష్, కోడం అమర్నాత్, కాముని నళినీకాంత్, దేవదాస్, వెంకటరమణ రావు, యెల్లారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

● వేములవాడ : పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంబరాలు జరుపుకున్నారు. వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షడు సంద్రగిరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, కూరగాయాల కొమురయ్య, పుల్కం రాజు, రాంబాబు, చంద్రశేఖర్ యాదవ్, కొక్కుల రాజు, అజయ్ తదితరులు ఉన్నారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన నాగుల విష్ణుప్రసాద్ భీమన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నాడు.

● చందుర్తి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతపటి రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో సంబురాలు జరిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, భానుచందర్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, మిరుదొడ్డి భాను, శీల ప్రశాంత్, తాళ్ల విజయ్‌రెడ్డి, బద్దిపడిగె అనిల్‌రెడ్డి, దీటి నర్సింలు, రంజాని నరేశ్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో సంబరాలు జరిపారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, మాజీ వైస్‌ఎంపీపీ జంగ కాశీరాములు, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బంగ్ల రాజు, పిట్ల వెంకటి, గౌరిశంకర్, కోట లింగం, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, బాస్కర్, ప్రసాద్, నరేష్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గౌస్, రాంరెడ్డి, బాబు, రవీందర్, రాజ్‌కుమార్, గోపాల్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు తీగల పుష్పలత, నాయకులు అయిలయ్య, రమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, చిట్టి ఆనందరెడ్డి, మామిడి సంజీవ్, మామిడి రాజు, చల్ల నారాయణ, బొల్లవేని రమేష్, నీలం అంజయ్య, ఒగ్గు రమేష్, జ్యోతి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, సూర యాదయ్య, కట్కూరి దాసు, దయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నెల రమణారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగుల వంశీ, కొడగాని వెంకటేష్, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో, నేరెళ్ల నర్సింగం గౌడ్, లింగాల భూపతి, బైరినేని రాము, చుక్క శేఖర్, గడ్డం మధుకర్, కొత్త రవీందర్, మోర లక్ష్మీరాజం, గుగ్గిళ్ల భరత్, పొన్నాల పరుశరాములు, చెన్నమనేని ప్రశాంత్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌బాషా, కేతిరెడ్డి జగన్మోహన్, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, మానుక సత్యం, పెంతల శ్రీనివాస్, సదానందం, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బోయినపల్లిలో ఎమ్మెల్యేకు స్వీటు తినిపిస్తున్న మాజీ జడ్పీటీసీ

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

గంభీరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. గంభీరావుపేటలో రూ.14 లక్షల నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థులకు కుట్టించిన యూనిఫాంలను, పోషకాహారం ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ప్రతి చిన్నారి సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో చదవాలని, కేంద్రాల్లో అందించే కోడిగుడ్లు, బాలామృతం, అన్నం, ఇతర పోషకాహారాన్ని వారికి తినిపించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు ఆటల్లో, చదువుల్లో రాణిస్తారన్నారు. పిల్లలు బడి బయట ఉండవద్దని, రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని, చేతులు శుభ్రం చేసుకుని తినాలని ఆడుకోవాలన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో 3నెలల పాటు పోషకాహారం ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు మునగ ఆకు, నువ్వులు, ఇతర కూరగాయలు, కోడిగుడ్లు, పాలు ఆహారంలో బాగం చేసుకుంటే మందులు అవసరం లేదన్నారు. ప్రతి ఇంట్లో మహిళలు పోషకాహారం తీసుకోవాలని వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా బాగుంటుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ధాన్యం నిల్వలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొదలైన చలి..

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చే జనం మంకీ క్యాప్‌లు, సాక్స్‌లు, జర్కిన్‌లు, స్వెటర్‌లు, టోపీలు, మఫ్లర్లతో చలిని ఎదుర్కోవడానికి కొనుగోలు చేస్తున్నారు. ఏడాదిలోనే కేవలం ఈ మూడు నెలల్లోనే చలికి తప్పనిసరిగా వాడే స్వెటర్లు కొనుగోలు చేస్తుంటారు. ఉన్నితో తయారుచేసిన దుస్తుల కొనుగోలుకు ఇష్టపడుతారు. ఈసారి ధరలు కొంత పెరిగినా ఆకర్షణీయమైన రంగుల్లో స్వెటర్లు అమ్మకాలకు ఉంచారు. చిన్నపిల్లల క్యాపులు రూ 50 నుంచి రూ 100 వరకు, సాక్స్‌లు రూ.25 నుంచి రూ 100 వరకు, జర్కిన్‌లు రూ 100 నుంచి రూ 700 వరకు, పెద్దలకు స్వెటర్లు రూ.200 నుంచి రూ.1000 వరకు టోపీలు రూ 50 నుంచి రూ 150 వరకు, జర్కిన్‌లు రూ 500 నుంచి రూ 1500 వరకు, చెవుల క్యాపులు రూ 50 నుంచి రూ.100 వరకు, మహిళల క్యాపులు రూ.30 నుంచి రూ.110వరకు, మఫ్లరు రూ.75 నుంచి రూ.200 వరకు లభిస్తున్నాయి.

చలిమంటలు.. జాగ్రత్తలు..

చలికాలం అనగానే తెల్లవారుజామునే ఆరుబయట మంటలు వేసుకోవడం అలవాటు. మంటలు వేసుకునే సమయంలో చిన్నారులను దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి. మహిళలు చీర కొంగులను జాగ్రత్తగా గమనించాలి. మంట వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు.

ఆర్థిక సహాయం

తంగళ్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీఆర్ నగర్‌కు చెందిన నిరుపేద మహిళ దండి లావణ్య(35) శుక్రవారం మరణించగా సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు అండగా నిలిచారు. సంఘం అధ్యక్షుడు దూడం శంకర్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ మృతురాలు కూతుళ్లను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. సిరిసిల్ల పద్మశాలి సంఘం డైరెక్టర్లు, నూతన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



సిరిస్లిల శుభోదయం హైస్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుభోదయం హైస్కూల్‌లో వేడుకలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలల్లో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● వేములవాడ : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో, గౌతమ్ మోడల్, ద్రోణ, స్కై, క్రిష్ణవేణి టెక్నో, టాలెంట్ స్కూళ్లలో వేడుకలు నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కాగా గౌతమ్ మోడల్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు హ్యాపీ చిల్డ్రన్స్ డే పిక్టోగారాన్ని అందంగా రూపొందించడంతో ఎంతో ఆకర్షణగా నిలిచింది. ఆయా స్కూళ్ల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని ఎనగల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సునీతరాణి, ఉపాధ్యాయులు శ్రీరాముల నరేందర్, పారం లక్ష్మీనారాయణ, కృష్ణ చైతన్య, సుస్మిత, చైతన్యగౌడ్, కవిత, శివప్రసాద్ పాల్గొన్నారు. మర్రిగడ్డ, నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయురాలు జితేందర్, బార్గవి, ఉపాధ్యాయుడు రామస్వామి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో నెహ్రూ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్, పెద్దలింగాపూర్, ఒగులాపూర్, దాచారం గ్రామాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఇల్లంతకుంటలోని వాణీనికేతన్ హైస్కూల్, పొత్తూరులోని వివేకానంద పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులుబోయిని తిరుపతి, రాణి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, తూముకుంట శ్రీనిధి, పండరీనాథ్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు

● తంగళ్లపల్లి : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించి అనంతరం బాలల సభ జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్ నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, మండల కాంగ్రెస్ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. దివంగత ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో మురళి నాయక్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా విద్యా బోధన చేయడంతో పాటు కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల మహానీయుల వేషధారణ ఆకట్టుకుంది.

జూబ్లీహిల్స్ విజయం బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు : కేకే

గంభీరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు అని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేటలో శుక్రవారం కేకే మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గతంతో బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నర ఏళ్ళ దురంకార పాలనకు వ్యతిరేకంగా వేసిన ఓటేనన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నందుకే జూబ్లీ ఉప ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని అందించారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు గల్లీలో కుస్తీ పడుతూ ఢీల్లీలో దోస్తీ చేస్తున్నందుకే ఈ రెండు పార్టీలకు జూబ్లీ ఎన్నికలు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, నాయకులు అక్కపల్లి బాలయ్య, లింగం, బంగ్ల రాజు, పిట్ల వెంకటి, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, భాస్కర్, గౌరిశంకర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు దివ్యాంగులకు మండల పరిషత్‌లో ఇంటర్వ్యూలు

ముస్తాబాద్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లచ్చాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల ఆర్థిక పునరావస పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



పంపిణీ చేసిన స్వేటర్లతో విద్యార్థులు

ఇల్లంతకుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎంఈవో చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ ఎస్సీకాలనీ పాఠశాలలో శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి బద్దం అనూష వితరణ చేసిన స్వేటర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలువాలనే ఆలోచన గొప్పదన్నారు. రూ15వేల విలువైన స్వెటర్లను అందించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

రుద్రంగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూమారు 80మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, కోమిరె శంకర్, అంబటి శంకర్, బండి యాదగిరి, గోడికారి హిరోజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని నెహ్రూ జయంతి వేడుకలు



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం జిల్లా కేంద్రం గీతనగర్‌లోని నెహ్రూ బాలల ఉద్యానవనంలో విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో కమిషనర్ ఖదీర్‌పాషా, అధికారులు చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్, సీనియర్ పట్టణ నాయకులు వంగరి దేవదాస్, నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

బోయినపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో కాంగ్రెస్ నాయకుడు పెండ్యాల శ్రీనివాస్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించి మృతురాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సభను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించే బీసీల ఆక్రోశ సభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ కందుకూరి రామాగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని కామారెడ్డిలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని మరిచారని, అందుకే కామారెడ్డిలోనే సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు బీసీ వర్గాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు నేరెళ్ల అనిల్‌గౌడ్, మామిడాల ఉమాశంకర్, బండి యోగి, తౌటి శివ, మామిడాల విజయ్, వొల్లపు బాబు తదిరులు ఉన్నారు.

నాగంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గంభీరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేటలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు ప్రారంభించారు. మిషన్‌భగీరథ తాగునీటి కోసం ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో బాగంగా రూ.7 లక్షల37వేలు విలువచేసే టాన్స్‌పార్మర్‌ను బిగించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏఈ ఆనంద్ కుమార్, పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సహకార వారోత్సవాలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాల ఎదుట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా సహకార సంఘం కార్యాలయాలపై ప్యాక్స్ చైర్మన్, వైస్ చైర్మన్లు సహకార జెండాను ఆవిష్కరించారు. దేశంలోని గ్రామీణ రైతుల ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో అన్నదాతలు రాణించేలా కృషి చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు కృష్ణామూర్తి, ప్రభాకర్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ : మండలంలో ఘనంగా సహకార వారోత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ సహకార జెండాను ఆవిష్కరించగా నాంపల్లి సింగిల్‌విండోలో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ విజయపవన్, ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్, సీఈవో మిట్ట లక్ష్మణ్, వినేష్, రైతులు కాంతారావు, తోట రాజు, కొండ శేఖర్ తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : సహకారవారోత్సవాల సందర్భంగా మండలకేంద్రంలోని కార్యాలయ ఆవరణలో శుక్రవారం పతాకాన్ని ఆవిష్కరించారు. ప్యాక్స్ డైరెక్టర్ కట్ట సుధాకర్‌రెడ్డి, సీఈఓ చిట్టి రవీందర్‌రెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట సింగిల్ విండో కార్యాలయంలో అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించారు. విండోచైర్మన్ బండ నర్సయ్య, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, మహేశ్వరి, రామచంద్రం, కేడీసీసీ మేనేజర్ దేవరాజం, సీఈవో కేశవులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ మూర్తి అన్నదానానికి శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ విస్తరణలో పనులలో ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండాలని కోరుకుంటూ అన్నదానానికి రూ. ఒక లక్ష చెక్కును ఆలయ ఈవో రమాదేవికి అందజేశారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సుహాసినులు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం సుహాసినులకు వాయనం అందజేశారు.

బీహార్‌లో గెలుపుపై బీజేపీ సంబరాలు



సిరిసిల్లలో బీజేపీ నాయకుల సంబరాలు



వేములవాడలో స్వీట్లు పంచుతున్న రామకృష్ణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన అద్భుతంగా కొనసాగుతోందని గుర్తించిన బీహార్ రాష్ట్ర ప్రజలు ఎన్‌డీఏ కూటమిని గెలిపించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. బీహార్ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి గెలుపొందడంతో జిల్లా కేంద్రంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ బీహార్ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని జరుగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి జడ్పీటీసీ వరకు బీజేపీ అభ్యర్థుల గెలుపు నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, బర్కంలక్ష్మీ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నె హరీష, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ : బీహార్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ ప్రభంజనం సృష్టించారని బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ అన్నారు. బీహార్‌లో ఎన్నికల్లో ఎన్‌డీయే విజయం సాధించిన సందర్భంగా వేములవాడలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో గతంలో ఏ ప్రధాని చేయని ఘనత నరేంద్రమోదీ చేస్తున్నారని అన్నారు. ఒక విజన్ ఉన్న నేత మోదీ అని కొనియాడారు. దేశ వ్యాప్తంగా ప్రజలు బీజేపి ప్రభుత్వానికి పట్టం కడుతున్నారని అన్నారు. 2010 తరువాత ఎన్డీయే కూటమికి అతిపెద్ద విజయమని అన్నారు. బీహార్‌లో సింగిల్ లార్జెస్ట్ పార్టీ బీజేపీ నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, కోల కృష్ణస్వామి, గుంటి కనుకయ్య తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ కూటమి విజయం సాధించడంపై నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో శుక్రవారం టపాసులు కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అందిస్తున్న సుపరిపాలనపై దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు లభిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. అందుకే ప్రజలు గెలిపించారన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల మల్లేశం, బత్తిని సాయగౌడ్, కొలనూరి ముత్తవ్వ, చిమ్మనగొట్టు శ్రీనివాస్, లంకోజు చంద్రం, పినకాసి అనీల్, గోపాల్, కమలాకర్‌రావు, శ్రీశైలం, బాలరాజు, కార్తీక్, పర్శరాం, శ్రీనివాస్, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.